అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే చర్యలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, మే5 : అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికార, రాజకీయ ఒత్తిడులకు లోను కావద్దని సూచించారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉంటే ఎస్ఓలే బాధ్యత వహించాలన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందిన వారికి తిరిగి రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధికి అర్హత ఉండదన్నారు. ఈ నెల 12న ప్రపంచ సుందరీమణులు నాగార్జునసాగర్‌కు వస్తున్నందున బుద్ధవనం, విజయవిహార్ వద్ద శానిటేషన్, లైటింగ్ ఏర్పాటు చేయాలని డీపీఓను ఆదేశించారు. వారికి ఆహ్వానం పలికే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఆర్డీఓలు వై.ఆశోక్‌రెడ్డి, శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించాలి

● మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం

సదస్సులో మాట్లాడుతున్న అంకతి సత్యం

నిడమనూరు, మే 5 : సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని బంకాపురం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవడం ద్వారా అధిక దిగుబడితో పాటు లాభాలు గడించవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వి.శ్రీధర్ సేంద్రియ ఎరువుల వాడకం, పంట మార్పిడి, తక్కువ నీటి వినియోగం వంటి వాటిపై అవగాహన కల్పించారు. సదస్సులో ఏఆర్ఎస్ అధిపతి ఎన్.లింగయ్య, ఏడీఏ వెంకట రవీందర్, ఏఓ ఎం.మునికృష్ణయ్య, క్లస్టర్ ఏఈఓ విజయచంద్ర, అభ్యుదయ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు అడ్డుకున్న గ్రామస్తులు

పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

త్రిపురారం, మే 5 : మండలంలోని పెద్దదేవులపల్లి చెరువు నుంచి నీటిని తరలించేందుకు డాక్టర రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం పైప్‌లైన్ వేస్తుండడంతో సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు నీరందించిన తర్వాతే డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం నీటిని తీసుకెళ్లాలన్నారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ముందుగా దానిని పరిష్కరించాలని, లేని పక్షంలో పనులు సాగనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దైద రవి, స్థానికులు మట్టయ్య, అంబటి శ్రీను, కొప్పు సోమయ్య, సురేశ్, వెంకటయ్య, వేణు, రమేశ్, నాగరాజు, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నారాయణ

ధాన్యాన్ని పరిశీలిస్తున్న దోటి నారాయణ

చండూరు, మే 5 : రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ సూచించారు. సోమవారం మండలంలోని కస్తాల, చండూరు, గుండ్రపల్లి, బంగారిగడ్డ, పుల్లెంల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నట్లు పలువురు రైతులు ఆయనకు తెలుపగా.. స్పందించిన ఆయన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన 60 లారీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ వైస్ చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓంకారం, డైరెక్టర్లు ఆంజనేయులు, నరసింహ, రామలింగయ్య పాల్గొన్నారు.

నేత్రదానంపై పెరుగుతున్న అవగాహన

నీలగిరి, మే 5 : జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టు ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టిన నేత్రదాన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్నది. సోమవారం పట్టణంలోని గందె అనసూర్య(60) మృతి చెందగా లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ శక్తి న్యూ వాయిసెస్ పాస్ట్ ప్రెసిడెంట్ ముద్దనూరు రమాదేవి మృతురాలి బంధువులను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించారు. దాంతో ఆమె నేత్రాలను దానం చేసేందుకు బంధువులు ముందుకు వచ్చారు. ట్రస్టు మేనేజర్ డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు ట్రస్టు కౌన్సిలర్ చిరునోముల చంద్రశేఖర్‌తో కలిసి అనసూర్య నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 113 నేత్ర దానాల ద్వారా 226 కార్నియా పొరలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నీషియన్ జాని, అనసూర్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

B.Ed MEMO పోయినది
మండల శాంతికుమార్, S/o. M.బాలశౌరి, R/o. H.No. 1-84, BC Colony, చెన్నమనయునికోట (గ్రా), కనగానపల్లి (మం), శ్రీ సత్యసాయి (జి) AP, ప్రస్తుత నివాసం నల్లగొండ నా యొక్క ఒరిజినల్ B.Ed Memo మరియు Provisional సర్టిఫికెట్స్ SLBC నుండి నల్లగొండ బస్టాండ్‌కు వెళ్తుండగా పోయినవి. దొరికినవారు సంప్రదించగలరు: 8099848070.

CHANGE OF NAME
★I, MOHAMMED CHAND SULTHANA, R/o. 5-12-214, Rahamath Nagar, Nalgonda, TG-508 001. I Changed My Name as CHAND SULTANA, W/o. Mohammed Tharaq.
NT-342901

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | రామన్నపేట: 9182777638

ప్రయాణం.. ప్రాణ సంకటం

● దామరచర్లలో ప్రమాదకరంగా మారిన నార్కట్‌పల్లి-అద్దంకి హైవే
● సర్వీసు రోడ్డు లేక ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులు

దామరచర్ల బస్టాండ్ వద్ద వాహనాల గజిబిజిగా వస్తున్న వాహనాలు

దామరచర్ల, మే 5: దామరచర్ల మండల కేంద్రం నుంచి వెళ్తున్న నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దాంతో ఈ రోడ్డు ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తున్నది. దామరచర్ల మండల కేంద్రం హైదరాబాద్, గుంటూరు, జాన్‌పహాడ్, అడవిదేవులపల్లి రూట్లకు కూడలిగా ఉంది. దాంతో మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై రద్దీ అధికంగా ఉంటున్నది. అయినా మండల కేంద్రంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయక పోవడం, రద్దీని నియంత్రించేందుకు చర్యలు తీసుకోక పోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

దామరర్లలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై భారీ వాహనాల రద్దీ

ప్రమాదాలు నిత్యకృత్యం

మండల కేంద్రం నుంచి సుమారు కిలోమీటరు దూరం వరకు అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి ప్రమాదకరంగా మారింది. బస్టాండ్ నాలుగు రోడ్ల కూడలి ప్రాంతం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలో యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ కూడా ఉండడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. పెద్దపెద్ద వాహనాలు సైతం ఈ మార్గం నుంచే వెళ్తుండడం, ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు, రోడ్డువెంటే వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దానికి తోడు మండల కేంద్రం నుంచి ఆంధ్రాలో కూలికి వెళ్లే ఆటోలు సైతం పదుల సంఖ్యలో నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటాయి. అవి కూడా వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఏడాది కాలంలోనే మండల కేంద్రంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగగా ఆరుగురు మృత్యువాత పడ్డారు. అనేక మంది గాయాల పాలయ్యారు.

సర్వీస్‌రోడ్డుకు కలుగని మోక్షం

నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేసి దశాబ్దాలు గడుస్తున్నా మండల కేంద్రంలో ఇంతవరకు సర్వీసు రోడ్డు నిర్మించక పోవడం, డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రోడ్డు లేక స్థానికులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారంతా హైవే పైనుంచే వెళ్లడంతో రద్దీ అధికమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారి కావడంతో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటం, దామరచర్ల నాలుగు రహదార్ల కూడలి కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారి వెంట సర్వీసురోడ్లు, బస్‌షెల్టర్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యవర్గం

శంకర్‌గౌడ్(అధ్యక్షుడు)

నకిరేకల్, మే 5 : ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నకిరేకల్ మండల కార్యవర్గాన్ని సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా నిమ్మల శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నోముల సైదులు యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు ఉపేందర్, రాకేశ్, నరసింహారావు, నరేశ్ పాల్గొన్నారు.

టీసీఏ ఆవిర్భావ దినోత్సవం

రామగిరి, మే 5: తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్(టీపీఏ) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు వెంకటేశ్వర్లు, అరుణ శోభ, సభ్యులు పాల్గొన్నారు.

వల్లభాపురంలో పశువైద్య శిబిరం

నిడమనూరు, మే 5 : మండలంలోని వల్లభాపురంలో సంగం డెయిరీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సంగం డెయిరీ తెలంగాణ జోనల్ హెడ్ కె. నాగప్రభు ప్రారంభించారు. అనంతరం సుమారు వంద పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ హర్షవర్ధన్, ప్లాంట్ మేనేజర్ పత్తిపాటి నాగరాజు, సూపర్‌వైజర్ జొన్నలగడ్డ వెంకట్రామిరెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం రుణాలకు కొర్రీలు పెడుతున్న ప్రభుత్వం

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, మే 5: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలు ఎగ్గొడుతున్న పారిశ్రామికవేత్తలకు, బడా బాబులకు, కాంట్రాక్టర్లకు బ్యాంకులు, ప్రభుత్వాలు వత్తాసు పలుకుతూ, వారు అడిగిందే తడవుగా ఎలాంటి పూచికత్తు లేకుండా వందల కోట్ల రుణాలు ఇస్తూ, బడుగు, బలహీనవర్గాల వారికి రుణాలు ఇవ్వడానికి కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. గతంలో తీసుకున్న వ్యక్తిగత రుణాలకు, ఇప్పుడు ఇవ్వనున్న యువ వికాసం రుణాలకు ముడి పెట్టే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈఓ బాలూనాయక్

మిర్యాలగూడ రూరల్,మే 5 : వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ లావూరి బాలూనాయక్ కోరారు. సోమవారం మండలంలోని యాద్గార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 నుంచి 14 సంవత్సరాల్లోపు పిల్లలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జూన్ 5వ తేదీ వరకు కొనసాగే శిబిరంలో కబడ్డీ, వాలీబాల్, కుట్లు, అల్లికలు, డాన్స్ వంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, అంతర్జాతీయ క్రీడాకారిణి మౌనిక, ఫిజికల్ డైరెక్టర్ వెంకటరత్నం, పుష్పలత, సైదయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలి : సీఐటీయూ

మిర్యాలగూడ : సీడీపీఓ మమతకు సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ, మే 5: ఈ నెల 20న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు భాగస్వాములవుతున్నట్లు ఆయా యూనియన్‌ల నాయకులు సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ రేఖల మమతకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బొందు పార్వతి, ప్రమీల, స్వరాజ్యం, సైదమ్మ, అరుణ, రషీద, విజయలక్ష్మి, విజయ, రాధాబాయి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

మర్రిగూడ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీహెచ్‌సీ మండల వైద్యాధికారి డాక్టర్ శాలినికి ఆశ కార్యకర్తలతో కలిసి సమ్మె నోటీసు అందించారు. అనంతరం బస్టాండ్ వద్ద పంచాయతీ కార్మికులకు ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు సల్వోజు రామలింగాచారి, ఆశ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి జంపాల వసంత, రమావత్ జయమ్మ, లక్ష్మి, కేశగోని మంజుల, పల్లె కౌసల్య పాల్గొన్నారు.

మర్రిగూడ : వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందిస్తున్న ఆశ కార్యకర్తలు

పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని వినతి

ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్

నిడమనూరు, మే 5: ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలకు మంజూరు చేయాలని ముకుందాపురం మాజీ సర్పంచ్ కేశవ శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేదలకు ఇండ్లు లేక గుడిసెలో నివసిస్తున్నారని, అధికారులు వారికి ఇండ్లు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా నిరుపేదలను గుర్తించి ఇండ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సలీం, రామ్, నాగరాజు పాల్గొన్నారు.

బైక్‌ను లారీ ఢీకొని మహిళ మృతి

గుర్రంపోడ్, మే 5: మండలంలోని నల్లగొండ -దేవరకొండ ప్రధాన రహదారిపై చేపూరు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం బైక్‌ను లారీ ఢీకొనడంతో మహిళ మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బాలాపూర్‌కు చెందిన అంజుమ ఖాతూన్ (43) భర్త అబ్దుల్ సలామ్‌తో కలిసి మండలంలోని పోచంపల్లిలోని రైతు తోటలో కూలి పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్న కూతురు సకీనా ఖాతూన్, అల్లుడు మహ్మద్ సలామ్‌ను చూసేందుకు వచ్చారు. అయితే పనిమీద అల్లుడితో కలిసి అతడి బైక్‌పైనే అత్తా మామలు చేపూరుకు వెళ్లారు. పని పూర్తి చేసుకొని తిరిగి వస్తుండగా క్రాస్ రోడ్డు వద్ద గుర్రంపోడు వైపు బైక్ మలుపుతిరుగుతున్న క్రమంలో నల్లగొండ నుంచి దేవరకొండకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దాంతో అంజుమ ఖాతూన్ అక్కడిక్కడే మృతిచెందింది. భర్త అబ్దుల్ సలాం, అల్లుడు మహ్మద్ సలామ్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కూతురు సకీనా ఖాతూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంపచెట్లతో నిండిన మురుగు కాల్వ

● దుర్వాసన, దోమలబెడదతో స్థానికుల ఇబ్బందులు

కంపచెట్లతో నిండిపోయిన మురుగు కాల్వ

మునుగోడు, మే5 : మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని చండూరు రోడ్డు దిగువ ప్రాంతంలో ఉన్న ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీటి కాల్వ లక్ష్మీదేవిగూడెం గ్రామం మధ్య నుంచి వెళ్తున్నది. ఈ మురుగు కాల్వను చాలా కాలంగా శుభ్రం చేయక పోవడంతో కాల్వ కంప చెట్లు, గడ్డి, చెత్తతో నిండిపోయింది. దాంతో మురుగు నీరు ముందుకు పారక దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. దానికి తోడు కాల్వలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికమైందని వారు పేర్కొంటున్నారు. కాల్వలోని కంప చెట్లను తొలగించి శుభ్రం చేయాలని పలు మార్లు గ్రామ కార్యదర్శికి, సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నంబర్‌ప్లేట్లు లేని వాహనాలకు జరిమానా

చిట్యాల, మే 5 : చిట్యాలలో సీఐ కె.నాగరాజు, ఎస్ఐ ఎన్. ధర్మల ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుతున్న 20 వాహనాలపై గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడిపినా, మైనర్‌లకు వాహనాలు ఇచ్చినా, పబ్లిక్ ప్లేస్‌లలో మద్యం సేవించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మే 5 : ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో నిర్మించిన లింగమంతుల స్వామి, గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొన్న అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్నాల కొనుగోళ్లలోనూ అధికారులు కొర్రీలు పెడుతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిసి ముద్దవుతోందని, కనీసం టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవన్నారు. ధాన్యం కొనుగోలు చేసి నెల రోజులైనా నేటికీ కొంత మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడం లేదన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సందినేని వెంకటేశ్వర రావు, తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేశ్, పెద్దగొల్ల చింతల వీరయ్య, అధ్యక్షుడు చింతల సైదులు, ఆలయకమిటీ సభ్యులు ఉన్నారు.

దేవరకొండ తాసీల్దార్‌గా మధుసూదన్‌రెడ్డి


తాసీల్దార్‌ను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

దేవరకొండరూరల్, మే5 : దేవరకొండ తాసీల్దార్‌గా ఎం.మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు దేవరకొండలో పనిచేసిన సంతోశ్‌కుమార్ మిర్యాలగూడకు బదిలీ కాగా ఆయన స్థానంలో కేతేపల్లి తాసీల్దార్‌గా పని చేస్తున్న మధుసూదన్‌రెడ్డి వచ్చారు.

తాసీల్దార్‌కు సన్మానం

చందంపేట(దేవరకొండ) : దేవరకొండ తాసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌రెడ్డిని సోమవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వరికుప్పల శ్రీను, మద్దెల విక్టర్, శ్యాంసన్, అంకం చంద్రమౌళి, లింగంపల్లి మధు, కడారి బలరాములు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత ఆలోచన విరమించుకోవాలి

● డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

రామగిరి, మే5: తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా విద్యార్థులు తక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణాలను శాస్త్రీయంగా పరిశీలించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇష్టారాజ్యంగా ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు ఇవ్వడంతోనే ప్రభుత్వ పాఠశాలలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వేసవిలోనే నిర్వహించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశం, వెంకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాభారతి నిర్మించాలని కలెక్టర్ కళాకారుల వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కవులు, కళాకారులు

రామగిరి, మే 5: నల్లగొండలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించుకునేందుకు కళాభారతి నిర్మాణం చేపట్టాలని కోరుతూ కవులు, కళాకారులు సోమవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టౌన్‌హాల్ ఉండేదని, కాలక్రమేణా అది శిథిలమవడంతో మున్సిపల్ యంత్రాంగం కూల్చి వేసిందని తెలిపారు. ప్రస్తుతం కవులు, కళాకారులు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తగిన చోటు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో స్పందించిన కలెక్టర్ నిర్మాణం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో కోమటి కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద